క్లుప్తంగా

అకాల వర్షం



బుచ్చినాయుడుకండ్రిగలో కురుస్తున్న వర్షం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం గంట పాటు కురిసింది. మండలంలో 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి మిరప, మామిడి రైతులకు మరోసారి నష్టం వాటిల్లింది. ఆలత్తూరు, కొత్త కండ్రిగ, చిన్నయగుంట, పూసలపల్లె, ఆర్.అనంతాపురం గ్రామాలకు వెళ్లే రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. వరి రైతులు మాత్రం వ్యవసాయ పనులకు పూనుకున్నారు. వరినాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు.

బోరుకు మరమ్మతులు చేయరూ!



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పుత్తేరిలోని చేతిపంపు చెడిపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పంపు చుట్టూ తుప్పు పట్టి, చిల్లులు పడడంతో నీరు వృధా అవుతూ చుట్టూ బురదమయమై అపరిశుభ్రంగా కనిపిస్తోంది. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డయాలసిస్ రోగికి పింఛను పంపిణీ



చంద్రశేఖర్‌కు పింఛను అందజేస్తున్న వెంకటసుబ్బయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితవాడకు చెందిన కె.చంద్రశేఖర్ కిడ్నీలు దెబ్బతినడంతో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు డయాలసిస్ చేసుకుంటున్నారు. అతడికి డయాలసిస్ కోసం రూ.10 వేల పింఛన్ మంజూరైంది. శుక్రవారం వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య పింఛను సొమ్మును అందజేశారు. తనకు పింఛను మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చంద్రశేఖర్, ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

ఫరీద్‌బాబా కళాసేవలు ప్రశంసనీయం



విప్పమానుపట్టిడలో ఫరీద్‌బాబాను సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి

రేణిగుంట: స్థానిక జబ్బార్ ట్రస్ట్ అధినేత షేక్ ఫరీద్‌బాబా కళాసేవలు ప్రశంసనీయమని విప్పమానుపట్టిడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి అన్నారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ నుంచి ఇటీవల ఆయన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న సందర్భంగా ఆయన్ను వేపాపురం సంజీవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని విప్పమానుపట్టిడలో సన్మానించారు. రంగస్థల, నాటక కళాకారులను ఆదరిస్తున్న ఫరీద్‌బాబా సేవలు ముమ్ముందు మరింతగా విస్తరించాలని కోరారు.

డీఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



డీఎస్పీకి వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి డీఎస్పీ డి.విశ్వనాథంకు శుక్రవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీఓ రామారావు ఆయన్ను శాలువాతో సత్కరించారు. పుణ్యక్షేత్ర పట్టణమైన శ్రీకాళహస్తిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతల పరిరక్షణలో డీఎస్పీ సేవలు శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో సీఐలు అజయ్‌కుమార్, అంజుయాదవ్, విక్రమ్, మల్లికార్జునరావు, ఎస్‌ఐలు వెంకటేష్, రాఘవేంద్ర, తిమ్మయ్య, రియాజ్, పోలీసులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం





సచివాలయ భవనానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అయ్యవారిపాళెంలో లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

- మరదవాడ గ్రామ సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాకారమవుతోందని, అలాగే మగ్గాలతో జీవనం సాగిస్తున్న నేతన్నలకు పెద్దపీట వేశారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం మండలంలోని మరదవాడలో నూతనంగా రూ. 27లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం లాంఛనంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా పరుగులు పెట్టిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. మళ్లీ సీఎంగా జగనన్న అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎప్పటిలాగే కృషి చేస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికులు ఎమ్మెల్యేను శాలువా, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మరదవాడ, రామలింగాపురం గిరిజనకాలనీ, సేలం ఇళ్లు, అయ్యవారిపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ లబ్ధిని కుటుంబాల వారీగా బుక్‌లెట్లతో వివరించారు. అలాగే నూతన జగనన్న ఇళ్లను కూడా లాంఛనంగా ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. స్థానికులు సీసీ రోడ్లు వేయాలని, మురుగునీటి కాలువలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. విడతల వారీగా నిధులు మంజూరు చేసి, సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివాయాదవ్, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచులు రోశయ్య, రమణయ్య, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల సుబ్రమణ్యం రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ బందిల సురేష్, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు మెంబర్ పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, పంచాయతీరాజ్ డీఈ మధుసూదనరావు, తహసీల్దార్ గౌరిశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

మండలంలోని మావిళ్లపాడు, అంబూరు గ్రామ పంచాయతీల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి తెలిపారు.

ఆగమోక్తంగా లక్ష్మీనృసింహుని కల్యాణం



ఉభయ నాంచారులతో లక్ష్మీనృసింహ కల్యాణం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: మండలంలో సింగిరికోనలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీదేవీ, భూదేవిలతో స్వామివారికి కల్యాణోత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి, నృసింహజయంతి, స్వాతీ నక్షత్రం శుక్రవారం రావడంతో ఉదయం నుంచి భక్తులు జలపాతంలో పవిత్ర స్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో స్వామిని కొలిచారు. ఉదయం ఉభయ నాంచారుల సమేతుడైన లక్ష్మీనృసింహస్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. స్వాతీ నక్షత్రం సందర్భంగా ఆలయంలో గణపతి, సుదర్శన, ధన్వంత్రి, శ్రీలక్ష్మీ హోమాలు చేశారు. పౌర్ణమి ఘడియల్లో ఉభయ నాంచారుల సమేతుడైన లక్ష్మీ నృసింహస్వామికి నిర్వహించిన కల్యాణంలో భక్తులు, దంపతులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ఉయ్యాల సేవను నిర్వహించారు. భక్తులు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఆలయ నిత్యాన్నదాన కేంద్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ గుణవంతరావు, సభ్యులు గిరిబాబు, భాస్కర్ పర్యవేక్షించారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



చందన అలంకరణలో కళగూరమ్మ

నారాయణవనం: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం వైశాఖ పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కీలగరంలోని కళగూరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. చందనాలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి ఉయ్యాలసేవ నిర్వహించారు. మహిళలు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. అలాగే సొరకాయలస్వామి ఆలయంలో నిర్వహించిన అభిషేకాలలో తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

అంకాలమ్మకు పంచలోహ వీణ సమర్పణ



పంచలోహ వీణతో అమ్మవారు

శ్రీకాళహస్తి: పట్టణంలో పీవీరోడ్డులోని శ్రీ అంకాలమ్మ అమ్మవారికి స్థానికులైన వెంకటేశ్వర్లు, జ్ఞాన ప్రసూనలక్ష్మి దంపతులు శుక్రవారం పంచలోహ వీణను సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా బుద్ధ పౌర్ణమి పూజలు





అన్నదానం చేస్తున్న సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, కీలపూడిలో అన్నాభిషేకంలో జలకంఠేశ్వర స్వామి

పిచ్చాటూరు: బుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు కీళపూడి, సిద్ధిరాజుకండ్రిగ, రామగిరి ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కీళపూడి శ్రీ జలకంఠేశ్వరునికి అన్నాభిషేకం చేశారు. స్థానిక ఓం శక్తి ఆలయంలో సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు. నాగలాపురం మండలంలోని హరి కంఠేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

యువతకు క్రీడాసామగ్రి పంపిణీ



జ్యోతినగర్ యువకులకు క్రీడాసామగ్రి అందజేస్తున్న సర్పంచ్ నగేషం

రేణిగుంట: స్థానిక జ్యోతినగర్, అన్నైనగర్‌కు చెందిన యువతకు శుక్రవారం చేయూత సోషల్ సర్వీస్ సంస్థ సర్పంచ్ నగేషం చేతుల మీదుగా క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. యువతకు క్రికెట్ బ్యాట్లు, వాలీబాల్, నెట్, షటిల్ రాకెట్లు అందజేశారు. యువత వేసవి సెలవుల్లో క్రీడానైపుణ్యాలను పెంచుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆల్బర్ట్, చేయూత సంస్థ అధ్యక్షురాలు ప్రత్యూష, కార్యదర్శి శ్రీనివాసులు, జూలియన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుని గరుడసేవ



గ్రామోత్సవంలో గరుడ వాహనంపై స్వామివారు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో ఊరందూరులోని శ్రీకాళహస్తీశ్వర అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం గరుడసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించారు. గరుడ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలైన నారాయణపురం, పెంకులపాడు, విశాలాక్షినగర్, జింగిలిపాలెం, గుంటకిందపల్లె, మద్దిలేడు, శ్రీకాళహస్తి పట్టణం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి హాజరయ్యారు. కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాలశంకరశర్మ భక్తులకు కుంకుమ, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఉభయ దాతలు బొజ్జల సుధీర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జంగాలపల్లి తులసీరామిరెడ్డి కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో అమాస చంద్రశేఖర్‌రెడ్డి, కాపిరెడ్డి విజయ్‌భాస్కర్‌రెడ్డి, లాయర్ గురవయ్య, దిలీప్, సాయి, శివ, నేతాజి, ఏపీసీడ్స్ మాజీ డైరెక్టర్ గున్నేరి నీలకంఠారెడ్డి, జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శింగేరికోనలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా వాసవీమాత హోమం



మహా మేరువుకు అభిషేకం చేస్తున్న అర్చకులు

గూడూరు: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయంలో శుక్రవారం 102 హోమ గుండాలు ఏర్పాటు చేసి, 204 జంటలతో వాసవీమాత హోమం వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి పూజలు చేశారు. అ లాగే శ్రీచక్ర మేరువుకు పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, గర్భగుడిలో ప్ర తిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీసం ముప్పుపై మరిన్ని పరిశోధనలు అవసరం

- అమరరాజ కర్మాగారంలో ఘనంగా లెడ్‌కాన్ 9వ ఎడిషన్



అమరరాజ బ్యాటరీస్ కంపెనీలో లెడ్‌కాన్-2023 సమావేశం

రేణిగుంట: లెడ్(సీసం) వినియోగం వల్ల కలిగే అనర్థాలు, భద్రతపై దేశంలో మరిన్ని పరిశోధనలు అవసరమని తిరుపతి స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ అన్నారు. మండలంలోని కరకంబాడి అమరరాజ కర్మాగారంలో శుక్రవారం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌ఓ) ఆధ్వర్యంలో ఇన్‌స్లార్ సహకారంతో లెడ్‌కాన్-2023 9వ ఎడిషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంగమ్మ జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. డబ్ల్యూహెచ్‌ఓ అంచనాల ప్రకారం లెడ్ కారణంగా ప్రత్యేకించి పిల్లల్లో తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. బ్యాటరీల తయారీలో వినియోగించే లెడ్ ఏఆర్‌బీఎల్ టెక్నాలజీతో ఇంజినీరింగ్ నియంత్రణలో తక్కువ మోతాదులో వినియోగిస్తున్నారన్నారు. అమరరాజ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గొరినేని హర్షవర్ధన్ మాట్లాడుతూ, అమరరాజ బ్యాటరీస్ సంస్థ ఆరోగ్యం, భద్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి అత్యుత్తమ పర్యావరణ ప్రమాణాలను పాటిస్తోందన్నారు. లెడ్‌కాన్-2023 సమావేశం తమ కంపెనీలో నిర్వహించడం సంతోషకరమన్నారు. తాము బ్యాటరీల తయారీల పరంగా లెడ్ ప్రాసెసింగ్‌లో అత్యుత్తమ పరిశుభ్రత పద్ధతులను పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అమరరాజ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులునాయుడు, డాక్టర్ చంద్రబాబు, ఏఆర్‌బీఎల్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బిశ్వదీప్ పాల్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ తుప్పిల్ వెంకటేష్, ఇండియన్ సొసైటీ ఫర్ లెడ్ అవేర్‌నెస్ అండ్ రీసెర్చ్ నేషనల్ చైర్మన్ ప్రొఫెసర్ అబ్బాస్ అలీ మహదీ, డాక్టర్ గిరిధర్ జ్ఞాని తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఆధీనం పీఠాధిపతి



జ్ఞానసంబంధ పరమాచార్యస్వామికి జ్ఞాపిక ఇస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తమిళనాడు ధర్మపురం ఆధీనం మఠ పీఠాధిపతి జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



కలశాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మహిళలు

ఏర్పేడు: చిత్రపౌర్ణమి సందర్భంగా మండలంలోని పాపానాయుడుపేట భద్రకాళి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు 108 కలశాలను ఊరేగింపుగా తీసుకుని వెళ్లి ఆలయంలో ఉంచి పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కోదండ రామాలయాన్ని సందర్శించిన ఎంపీ బీదమస్తాన్‌రావు




ఆలయం వద్ద ఎంపీ బీదమస్తాన్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పల్లమాలలోని శ్రీ కోదండ రామాలయాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు సందర్శించారు. ఆలయ ధర్మకర్త, చైర్మన్ చెలికం సుబ్రమణ్యంరెడ్డి బీద మస్తాన్‌రావుకు దర్శన ఏర్పాట్లు చేశారు. తన స్నేహితుడు సుబ్రమణ్యంరెడ్డి అతని స్వగ్రామంలోరామాలయాన్ని నిర్మించటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, సంజీవయ్య తదితరులు కల్యాణ మండపం నిర్మాణానికి ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీరాములురెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



సుమంగళి పూజ చేస్తున్న మహిళలు

దీర్ఘ సుమంగళీ భవ!



విశేష అలంకరణలో మంగళాదేవి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం సుమంగళి పూజ భక్తిప్రపత్తులతో చేశారు. ఆలయంలోని నంది మండలంలో శ్రీ మంగళాదేవి ఉత్సవ విగ్రహాన్ని ఆశీనులు చేశారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట వరుసగా కూర్చున్న మహిళల చేత అర్చకులు సుమంగళి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు అందజేసి దీర్ఘ సుమంగళీభవ అంటూ ఆశీర్వచనాలు పలికారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

విషజ్వరాల నివారణకు చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

ఏర్పేడు: విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని మోదుగుల పాలెం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. 4 రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న రోగులను గుర్తించి, వారికి మలేరియా, డెంగీ పరీక్షలు చేసినట్లు చెప్పారు. తాగునీటి శాంపిల్స్‌ను ల్యాబ్ పరీక్షల కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి పంపినట్లు చెప్పారు. గ్రామంలో విష జ్వరాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, డాక్టర్ రాఘవ రెడ్డి, సీహెచ్‌ఓ శివరాజు, సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, ఏఎన్‌ఎం కామాక్షి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెళ్లకూరు: స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. ఎస్‌ఈబీ అధికారుల కథనం మేరకు.. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వ ర్యంలో తాళ్వాయిపాడు వద్ద ఇసుక అక్రమ రవాణా వాహనాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న కర్పూరం చలపతికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్‌తో పాటు డ్రైవర్ శేఖర్‌బాబును అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది సురేష్, రమణయ్య పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో విద్యకు ప్రాధాన్యం



విద్యా సామగ్రి కిట్లు చూపుతున్న చిన్నారులతో పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు: తీర ప్రాంత గ్రామాల్లో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని జిందాల్ సింహపురి ఎనర్జీ ప్రైవేట్ లిమిటడ్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తీర ప్రాంత గ్రామాలైన మోమిడి, వరగలి, మన్నెగుంట, తమ్మినపట్నం, గుమ్మళ్ల దిబ్బ గ్రామాల్లోని సుమారు 200 మంది పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తీర ప్రాంత గ్రామాల్లో పరిశ్రమ సీఎస్ఆర్ కింద చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో తొలి అడుగుగా 200 మంది విద్యార్థులకు నెల రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటుగా వారికి అల్పాహారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు వచ్చిన హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, రేస్ కరస్పాండెంట్ బాలచెన్నయ్యలను అభినందించారు. విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లను అందజేశారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహించేందుకు రేస్ స్కూల్ ఉపాధ్యాయులు, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ, చేయూత సేవా సంస్థలు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బండి మాధవి, ఇరగరాజు ఏడుకొండలు, నెల్లిపూడి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు దార కోటేశ్వరరావు, పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ మాథ్యూ పాల్గొన్నారు.